సాక్షి
జగిత్యాల

బుధవారం । 11 । అక్టోబర్ । 2023

15 నుంచి కేసీఆర్ పర్యటన

- ఉమ్మడి జిల్లా హుస్నాబాద్ నుంచి ప్రచారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. షెడ్యూల్ విడుదలవటంతో పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. సిరిసిల్ల, మంథని, పెద్దపల్లి, హుస్నాబాద్, కోరుట్ల, పెద్దపల్లి నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచే ఎన్నికల శంఖారావం పూరించేందుకు గులాబీ బాస్ సిద్ధమయ్యారు.

సభల వివరాలు

తేదీ	నియోజకవర్గం
15 అక్టోబర్	హుస్నాబాద్
17అక్టోబర్	సిరిసిల్ల
02 నవంబర్	ధర్మపురి
03 నవంబర్	కోరుట్ల
07 నవంబర్	మంథని, పెద్దపల్లి



న్యూస్‌రీల్

'ఆరోగ్య మహిళ' కేంద్రాన్ని వినియోగించుకోవాలి



పీహెచ్‌సీలో ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

మల్లాపూర్: 'ఆరోగ్య మహిళ' కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్ అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలోని కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రాల్లో ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారని, పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని వెల్లడించారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి వాహిని, సీహెచ్‌వో రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఫార్మసిస్ట్ సైఫోద్దిన్, స్టాఫ్‌నర్స్ సుమ, ల్యాబ్ టెక్నీషన్ ఉమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నర్సింగరావు

మెట్‌పల్లి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని జ్యోతిబాపూలే బాలుర గురుకులం విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. వారిని నర్సింగరావు మంగళవారం పరామర్శించి పాఠశాలలో అందిస్తున్న భోజనంపై ఆరా తీశారు. గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలమైందనడానికి ఈ సంఘటనే నిదర్శనమన్నారు.

వృద్ధులను వేధిస్తే చర్యలు



భాస్కర్‌కు అభినందనలు తెలుపుతున్న సీనియర్ సిటిజన్లు

జగిత్యాల: వృద్ధులను వేధిస్తే చర్యలు తప్పవని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. మంగళవారం జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. సీనియర్ సిటిజన్స్, నిరాధరణకు గురవుతున్న తల్లిదండ్రుల ఫిర్యాదులు స్వీకరించి వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. తల్లిదండ్రులను వేధిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు భాస్కర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, ప్రకాశ్, అశోక్, రాజగోపాలచారి, యాకూబ్, హుస్సేన్ పాల్గొన్నారు.

రూ.2లక్షల నగదు సీజ్

మల్యాల(చొప్పదండి): ఎన్నికల నియమావళి ప్రకారం ఎటువంటి పత్రాలు, రశీదు లేకుండా డబ్బు తీసుకెళ్తున్న ఓ వ్యక్తి నుంచి రూ.2లక్షలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేసినట్లు ఎస్సై తీగల అశోక్ తెలిపారు. మండలంలోని బల్వంతాపూర్ అడ్డరోడ్డు వద్ద జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై సీఐ కోటేశ్వర్‌తో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా కోరుట్లకు చెందిన సుధాకర్ ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తుండడంతో స్వాధీనం చేసుకుని, జిల్లా అధికారులకు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

కేసీ కెనాల్‌కు నీటి విడుదల తగ్గింపు



కాకతీయ కాలువలో తగ్గిన నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను మంగళవారం రాత్రి తగ్గించారు. సోమవారం వరకు 6,400 క్యూసెక్కులు విడుదల చేయగా.. ప్రస్తుతం 5,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 7,198 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. లక్ష్మీ కెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 500 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి..!

- ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల విన్నపాలు
- విజయం కోసం బండి సంజయ్, మక్కాన్ సింగ్, ఆది శ్రీనివాస్, అడ్లూరి, కేకే ఆరాటం
- బీఆర్ఎస్ నుంచి చల్మెడ, కౌశిక్, సంజయ్‌లది అదే బాట..
- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికర రాజకీయం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: విజయం.. వేదిక ఏదైనా బరిలో ఉన్నవారితో దోబూచులాడే అనుభూతి. ఆఖరి క్షణం వరకు పోరాటం చేసినా.. ఎవరిని వరిస్తుందో తెలియని ఉత్కంఠ. అందు కే, ఓటమిని తలచుకొని బాధ పడకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా చివరి వరకు పోరాడాలి అంటారు. తాజా రాజకీయ పరిస్థితుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పలువురు నాయకులు అసెంబ్లీకి పోటీ పడుతున్న తీరు కూడా అలాగే కనిపిస్తోంది. పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యే ఆశావహులు తమను ఈసారైనా గెలిపించాలని.. ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ ప్రజల ముందుకు వస్తున్నారు. విపక్షాల మాటలు నమ్మితే మోసపోతారని, తమను తిరిగి గెలిపిస్తే అభివృద్ధి కొనసాగిస్తామని.. తమకు మరో అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్త ఆశావహులు ప్రచారం ప్రారంభించారు.

వరుస ఓటములు.. అయినా బరిలో..

ఉమ్మడి జిల్లాలో పలువురు వరుస ఓటములు ఎదురైనా ఏమాత్రం కుంగిపోకుండా విజయం కోసం బరిలో నిలుస్తూనే ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నుంచే ఉండటం గమనార్హం.

- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆది శ్రీనివాస్(వేములవాడ), అడ్లూరి లక్ష్మణ్(ధర్మపురి), కేకే మహేందర్‌రెడ్డి(సిరిసిల్ల) నాలుగు సార్లు బీఆర్ఎస్ చేతిలో పరాజయం పాలయ్యారు. అయినా, వీరంతా ఏమాత్రం వెరవకుండా ఈసారి ఎలాగైనా గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.
- కరీంనగర్ నుంచి 2014, 2018 ఎన్నికల్లో ఎంపీ బండి సంజయ్(బీజేపీ), పొన్నం ప్రభాకర్(కాంగ్రెస్)లు రెండుసార్లు ఓడారు. అయినా మూడోసారి బరిలో దిగి, గెలుపు రుచి చూడాలనుకుంటున్నారు.
- హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి 2018లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి, ఓడిపోయారు. ఇప్పుడు అసెంబ్లీకి తిరిగి పోటీ చేస్తున్నారు.
- మానకొండూరు నుంచి 2009లో ప్రజారాజ్యం, 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కవ్వంపల్లి సత్యనారాయణ ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.
- 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి రామగుండం బరిలో నిలిచిన మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌కు నిరాశ ఎదురైంది. ఈసారి కర్ణాటక ఎన్నికల ప్రభావం, ప్రభుత్వ వ్యతిరేకత అనుకూలిస్తుందని విజయంపై ధీమాగా ఉన్నారు.
- కోరుట్ల నియోజకవర్గం నుంచి 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ నుంచి జువ్వాడి నర్సింగరావు పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు కూడా పోటీకి సిద్ధంగా ఉన్నారు.
- 2009లో పెద్దపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయరమణారావు గెలిచారు. తర్వాత 2014లో టీడీపీ, 2018లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినా విజయం వరించలేదు. ఈ సారీ ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.
- 2014లో, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి పోటీ చేసిన చల్మెడ లక్ష్మీనరసింహారావు ఓడిపోయారు. ప్రస్తుతం పార్టీ మారి, బీఆర్ఎస్ అభ్యర్థిగా వేములవాడ నుంచి బరిలో నిలిచారు.
- మంథని నుంచి 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున పుట్ట మధు పోటీచేసి, ఓడిపోయారు. 2014లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. 2018లో పరాజయం పాలైనా.. ఈసారి విజయంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు.

అభివృద్ధిపై సిట్టింగ్‌ల హామీ

మరోవైపు ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలకు గానూ 11 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే బరిలో ఉన్నారు. వీరిలో 8 మంది సీనియర్లు కాగా.. ముగ్గురు కొత్తగా పోటీలో నిలిచారు. తమకు మరో చాన్స్ ఇస్తే.. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి/షాదీముబారక్, పింఛన్లు, గృహలక్ష్మి, బీసీబంధు తదితర సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేయడంతోపాటు మరింత అభివృద్ధి చేసి చూపుతామని హామీ ఇస్తున్నారు.

- కేటీఆర్ (2009, 2010, 2014, 2018) నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సిరిసిల్లలో తన మార్క్ చూపించారు. సిరిసిల్ల నేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ధీమాగా ఉన్నారు.
- గంగుల కమలాకర్ 2009లో టీడీపీ, 2014, 2018లో బీఆర్ఎస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించి, కరీంనగర్‌లో కొత్త రికార్డు సృష్టించారు. స్మార్ట్‌సిటీ, కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్‌ఫ్రంట్ వంటి రూ.వందల కోట్ల ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో మంత్రిగా నియోజకవర్గంపై తనదైన ముద్ర వేశారు. నాలుగోసారి విజయంపై కన్నేశారు.
- కొప్పుల ఈశ్వర్ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి వరుసగా విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ధర్మపురి నుంచే బరిలో నిలిచారు.
- 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ (మానకొండూరు), దాసరి మనోహర్‌రెడ్డి (పెద్దపల్లి), వొడితెల సతీశ్‌బాబు (హుస్నాబాద్) తాజా ఎన్నికల్లో గెలిచి, హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు.
- 2018 ఎన్నికల్లో డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), కోరుకంటి చందర్(రామగుండం), సుంకె రవిశంకర్(చొప్పదండి) గెలిచారు. రెండోసారి విజయం సాధించే ప్రయత్నాల్లో ఉన్నారు.
- ఈటల రాజేందర్ హుజూరాబాద్ నుంచి 2004, 2008, 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఆరుసార్లు బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచారు. అనూహ్యంగా పార్టీ మారి, 2021 ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధమయ్యారు.
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాల నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1983 టీడీపీ నుంచి శాసనసభకు వెళ్లిన ఆయన.. 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలవనున్నారు.
- డాక్టర్ సంజయ్ కోరుట్ల, పాడి కౌశిక్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు కొత్తగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేయనున్నారు. వీరిలో కౌశిక్, చల్మెడ గతంలో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినవారే.
- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా గెలిచిన కోరుట్ల ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. రమేశ్ బాబు మాత్రం 2009లో టీడీపీ నుంచి గెలవగా, కోరుట్ల నుంచి విద్యాసాగర్‌రావు నాలుగుసార్లు కారు గుర్తు మీదనే గెలవడం గమనార్హం.

కోరుట్ల బరిలో నిజామాబాద్ ఎంపీ..!

- పోటీ చేసేందుకు ధర్మపురి అర్వింద్ సుముఖత
- ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి హామీ?
- పసుపు బోర్డు ప్రకటనతో బీజేపీ కేడర్‌లో జోష్



ఎంపీ అర్వింద్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగుతారన్న ప్రచారం ఊపందుకుంది. ఎంపీలను ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పరిధిలోని ఏదో ఒక అసెంబ్లీ స్థానంలో పోటీ చేయాల్సిందేనని బీజేపీ అధిష్ఠానం ఆదేశించడంతో తమకు అనుకూలమైన స్థానంలో బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలోనే ఎంపీ అర్వింద్ తన పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గంలో ఎంపీ సామాజిక వర్గ ఓట్లు అధికంగా ఉన్నాయి. దీనికితోడు ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అదే సమయంలో ఎన్నికలకు ముందే మూతపడిన షుగర్ ఫ్యాక్టరీని ప్రధాని మోదీ, అమిత్‌షాల దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే పునఃప్రారంభించేలా చూస్తానన్న హామీతో ఓట్లు అడిగేందుకు అర్వింద్ సమాయత్తమవుతున్నట్లు సమాచారం. కోరుట్ల నియోజకవర్గంలో పసుపు, చెరుకు పండించే రైతులు అధికంగా ఉండడం.. అటు పసుపుబోర్డు, ఇటు షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం అంశం ఎన్నికల్లో కలిసొస్తుందన్న ఆలోచనలో అర్వింద్ ఉన్నట్లు తెలిసింది. గతంలో మెట్‌పల్లి నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలిచిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఈ ప్రాంత అభివృద్ధి కోసం శ్రమించారు. దీంతో ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇప్పటికీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. ఇది కూడా తన గెలుపునకు దోహదపడుతుందని, ఆర్మూర్‌తో పోలిస్తే కోరుట్లలోనే విజయం సాధించడం సులువనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

కోడ్ కూసినా దళితబంధు లాగిన్?

- సదరు అధికారిపై కలెక్టర్ సీరియస్

కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన క్రమంలో కోడ్ పటిష్టంగా అమలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం నుంచి వివిధ శాఖల అధికారులు తమతమ శాఖల వెబ్‌సైట్ నుంచి లాగౌట్ అయ్యారు. అయితే దళితబంధుకు సంబంధించిన వెబ్‌సైట్ సాయంత్రమైనా లాగిన్‌లో ఉండి మార్పులుచేర్పులు జరుగుతున్నట్లు అనుమానించిన కొందరు కలెక్టర్ యాస్మిన్‌బాషాకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఆ అధికారిపై కలెక్టర్ సీరియస్ అయినట్లు సమాచారం. దళితబంధు వెబ్‌సైట్ రాత్రి వరకు ఎందుకు లాగిన్‌లో ఉన్నారనే విషయంపై ఆరా తీసినట్లు తెలిసింది. కలెక్టర్ ఆగ్రహంతో సదరు అధి కారి వెబ్‌సైట్ నుంచి లాగౌట్ అయినట్లు తెలుస్తోంది.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

- మీరు – నేను కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- రాయికల్ మండలం బోర్నపల్లిలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



బోర్నపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు, నాయకులు

రాయికల్: జగిత్యాల ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచాక ప్రజలకు అందుబాటులో ఉంటూ.. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేశానని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి రాయికల్ మండలం బోర్నపల్లిలో 'మీరు – నేను' నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చొరవతో గ్రామంలో రూ.70 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని, రూ.7కోట్లతో పనులు చేశామని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు గ్రామంలోని ప్రతి ఇంటికీ చేరాయని, రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో వేలాది ఎకరాలు సస్యశ్యామలం అయ్యాయని తెలిపారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, గొల్లకుర్మలకు సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేశామన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని కోరారు. జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సర్పంచ్ పాదం లత, ఎంపీటీసీ పెంద్రం కవిత, ఏఎంసీ చైర్మన్ మారంపల్లి రాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు రవీందర్, మధు, రఘు పాల్గొన్నారు.

మహిళా బాంధవుడు సీఎం కేసీఆర్

జగిత్యాల: సీఎం కేసీఆర్ మహిళా బాంధవుడు అని, ఆడబిడ్డల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఇందులోభాగంగానే జిల్లా కేంద్రానికి చెందిన 3,722 మందికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను మంగళవారం అభినందించారు. ఆడబిడ్డల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టారని, షీటీంలు, బీడీ కార్మికులకు జీవనభృతి, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి, ఆరోగ్యమహిళ, గృహలక్ష్మి వంటివి చేపట్టారని తెలిపారు. ఇళ్లు రాని నిరుపేదలు అధైర్యపడొద్దని, ఇంకా 800 ఇళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శరత్‌రావు, వంశీరావు పాల్గొన్నారు.

'దళితబంధు'పై పంచాయతీ కార్యాలయం ముట్టడి

- అనర్హులకు ఇస్తున్నారని ఆగ్రహం



పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు

ధర్మపురి: దళితబంధు పథకాన్ని అనర్హులకు కట్టబెడుతున్నారంటూ మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన దళితులు గ్రామపంచాయతీని ముట్టడించారు. సర్పంచ్, ఎంపీటీసీని నిలదీశారు. గ్రామంలో సుమారు 300 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 70 మందిని అర్హులుగా గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం వీరిలో 40మంది పేర్లతో జాబితా విడుదల చేసింది. ఆ జాబితాలో ఆర్థికంగా ఉన్నవారు, భూస్వాములే ఉన్నారని మిగిలిన దళితులు మంగళవారం పంచాయతీని ముట్టడించారు. కార్యాలయంలో ఉన్న సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ కాళ్ల సత్తయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగులు, నిరుపేదలు, నిరుద్యోగులు ఉన్నా.. అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సర్పంచ్, ఎంపీటీసీ బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని నచ్చజెప్పినా వినిపించుకోలేదు. ప్రజల సమక్షంలో కొత్త లిస్టు తయారు చేస్తామని, అందరికీ అవకాశం కల్పిస్తామని, ఎవరూ అధైర్యపడొద్దని సర్పంచ్ నచ్చజెప్పడంతో విరమించారు.

'ఆశ'ల సమ్మె విరమణ



విధుల్లో చేరుతున్న ఆశవర్కర్లు

జగిత్యాలటౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ 15రోజులుగా సమ్మె చేసిన ఆశవర్కర్లు మంగళవారం విధుల్లో చేరినట్లు సీఐటీయూ జిల్లా కో–కన్వీనర్ ముదుగం రాజలింగం తెలిపారు. ఆశల 18 డిమాండ్లపై పరిశీలన జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని హెల్త్ డైరెక్టర్ హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

ఆయుధాలు డిపాజిట్..!

- జిల్లాలో లైసెన్స్‌డ్ తుపాకులు 32
- పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని నోటీసులు
- ఎన్నికల నేపథ్యంలో అధికారుల నిర్ణయం



తుపాకీ

జగిత్యాలక్రైం: శాసనసభ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడం.. కోడ్ అమల్లోకి రావడంతో వ్యక్తిగత లైసెన్స్‌తో ఆయుధాలు కలిగిన వారి నుంచి వాటిని డిపాజిట్ చేసుకునేందుకు పోలీస్‌స్టేషన్ల వారీగా నోటీసులు జారీ అయ్యాయి. జిల్లామొత్తంగా 32 లైసెన్స్‌డ్ తుపాకులున్నాయి. ఇందులో 9 బ్యాంక్ సెక్యూరిటీ కోసం.. మిగిలిన 23 తుపాకులను వ్యక్తిగత రక్షణ కోసం వినియోగిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఉన్న లైసెన్స్‌డ్ తుపాకులను తెప్పించుకుని పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయిస్తున్నారు. ఆయుధాలు ఉన్నవారు ఎవరినైనా బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని ఎన్నికలు పూర్తయ్యేవరకూ స్వాధీనం చేసుకుని తిరిగి అప్పగించనున్నారు. వారి వివరాలు సేకరించి నేషనల్ డేటా బేస్ ఆర్మ్స్ లైసెన్స్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఆయుధ లైసెన్స్ కలిగిన ప్రతి ఒక్కరికి ఐడీ నంబరు కేటాయించారు.

ఆయుధ లైసెన్స్ పొందాలంటే..

భద్రత కోసం ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ఇతరులు ఆయుధ లైసెన్స్ పొందాలంటే పలు కారణాలు చూపించాల్సి ఉంటుంది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి వ్యక్తి ఇతరుల నుంచి ప్రాణహాని ఉంటేనే లైసెన్స్ జారీ చేస్తారు. సంబంధిత వ్యక్తి సంఘ విద్రోహ శక్తులు, మావోయిస్టులతో సంబంధం ఉండకూడదు. రాజకీయ నాయకులు ప్రత్యర్థి పార్టీ నుంచి ముప్పు ఉంటే లైసెన్స్ ఇస్తున్నారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే వ్యాపారులు, రియల్టర్లు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆస్తుల రక్షణ కోసం ఆయుధ లైసెన్స్‌లు జారీ చేస్తున్నారు. ఎవరైనా లైసెన్స్‌లు కావాలంటే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దానిని రెవెన్యూ అధికారులు, పోలీసు కమిషనర్ నుంచి క్షేత్రస్థాయి పోలీస్ అధికారి వరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆ తర్వాత లైసెన్స్ జారీ చేస్తారు. లైసెన్స్‌దారుడు మూడేళ్లకోసారి రెన్యూవల్ చేయించుకోవాలి. మూడు నుంచి ఆర్నెళ్లకోసారి లైసెన్స్ గడువును పోలీసులు పరిశీలిస్తారు. రిటైర్డ్ మిలటరి ఉద్యోగులకు జీవనోపాధి కోసం ఆయుధాల లైసెన్స్ జారీ చేస్తున్నారు. ఒక లైసెన్స్‌పై మూడు ఆయుధాలు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఆయుధాలు విక్రయించేందుకు అనుమతి గల దుకాణాల్లో పిస్టల్, రివాల్వర్ తదితర ఆయుధాలను కొనుగోలు చేసి వాటి వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలి. లైసెన్స్ కలిగిన వ్యక్తులపై ఏదైనా సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదైతే వారి ఆయుధ లైసెన్స్ కూడా రద్దు చేస్తారు. ఆయుధాలను అనవసరంగా వినియోగించినా లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంది. ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్‌లు పొందిన వ్యక్తులు తమ ఆయుధాలను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని ఇప్పటికే పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల అనంతరం తిరిగి లైసెన్స్‌లు ఉన్న వారికి తమ ఆయుధాలను అప్పగించనున్నారు.

వారం రోజులు గడువు



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్ ఉన్న తుపాకులను ఆయా పోలీస్‌స్టేషన్లలో వారం రోజుల్లో అప్పగించాలి. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బ్యాంక్ సెక్యూరిటీగార్డుల ఆయుధాలు తప్ప మిగతా వారివి డిపాజిట్ చేసుకుంటున్నాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

క్లుప్తంగా

ధర్మపురిలో డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నందిని

ధర్మపురి: ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం డీపీఎల్ (ధర్మపురి ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌ను కొప్పుల ఈశ్వర్ కూతురు నందిని చేతులమీదుగా ప్రారంభించారు. టోర్నమెంటులో మొత్తం 16 టీంలు పాల్గొంటున్నాయి. గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందిస్తారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, కౌన్సిలర్లు తరాల కార్తీక్, వేణు, సుధాకర్ తదితరులున్నారు.

వాల్మీకి ఆవాస భవన నిర్మాణానికి విరాళం



చెక్కు ఇస్తున్న రవీందర్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలో వాల్మీకి ఆవాస నూతన భవన నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకుడు ముదుగంటి రవీందర్ రెడ్డి దంపతులు రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. సంబంధిత చెక్కును మంగళవారం ఆవాస నూతన భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ డాక్టర్ భీమనాతిని శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎన్నమనేని అశోక్‌రావు, గడ్డం మహిపాల్‌రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, గుర్రం రాము, ఆవాసం ప్రముఖ్ సుద్దాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

భవితలో మానసిక వికలాంగుల దినోత్సవం



మానసిక వికలాంగులతో అధికారులు

జగిత్యాలజోన్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం భవిత (ప్రత్యేక అవసరాల గల పిల్లల వనరుల కేంద్రం)లో మానసిక వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కటుకం చంద్రమోహన్ మాట్లాడుతూ మానసిక వికలాంగులకూ హక్కులున్నాయని, వాటిని ప్రతిఒక్కరూ కాపాడుకోవాలని సూచించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.సతీశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్.విజయ్‌కృష్ణా, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హరీశ్, న్యాయవాది కరుణాకర్, న్యాయ సేవా అధికార సంస్థ సూపరింటెండెంట్ వెంకన్న, వినయ్, భవిత కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలో రెండు చోట్ల అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని సీజ్ చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. స్థానిక మహాలక్ష్మి నగర్‌లోని గిన్నెర రవి ఇంట్లో సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టగా 48 లీటర్ల మద్యం దొరికిందన్నారు. అలాగే, హనుమాన్ వాడకు చెందిన బుర్ర శివ ఇంట్లో 7 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

మొక్కజొన్న రైతుల విలవిల



జగిత్యాలలో పంట కోసి, కంకి విరుస్తున్న రైతులు

- పంట చేతికొచ్చినా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- దళారులకు విక్రయించి, నష్టపోతున్న కర్షకులు
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు
- జిల్లాలో 37,980 ఎకరాల్లో సాగు



వేంపేటలో ఆరబోసిన మక్కలు

జగిత్యాలఅగ్రికల్చర్/మెట్‌పల్లిరూరల్: జగిత్యాల జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న. వానాకాలం సీజన్‌లో ఓ వైపు అడవిపందులు, మరోవైపు రామచిలుకలు, కోతుల నుంచి రాత్రింబవళ్లు కష్టపడి, పంట పండించారు. కానీ మక్కలను ఆరబెట్టి, అమ్ముకుందామంటే, సరైన ధర రాక రైతులు దిక్కులు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు మక్కలను కొనుగోలు చేసే ప్రభుత్వం ఈ సీజన్‌కు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో అసలు పట్టించుకుంటారా.. లేదా అనే మీమాంసలో ఉన్నారు.

11.01 లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా

జిల్లాలో 37,980 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. వ్యవసాయాధికారులు ఎకరానికి 29 క్వింటాళ్ల చొప్పున, 11.01 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే, ఈసారి వర్షాలు అధికంగా కురవడంతో పంట 50 శాతం దెబ్బతింది. సగటున ఎకరాకు 18 నుంచి 19 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీని ప్రకారం చూస్తే, జిల్లాలో 7 నుంచి 8 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి రానుంది. ప్రస్తుతం రైతులు పంటను కోసి, కంకి బూరు తీసి, కళ్లాల్లో ఆరబెడుతున్నారు.

మొన్న రూ.2,300.. ఇప్పుడు రూ.1,800

మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,090. అయితే, మొన్నటివరకు దీనికి మించి క్వింటాల్‌కు రూ.2,300 వరకు ధర పలికింది. ఇప్పుడు పంట రైతుల చేతుల్లోకి రాగానే అమాంతం రూ.1,800కు పడిపోయింది. ప్రభుత్వ మద్దతు ధరతో చూస్తే క్వింటాల్‌కు రూ.290 వరకు నష్టపోవాల్సి వస్తుంది. ఫలితంగా దళారులు పెడుతున్న రేటును బట్టి జిల్లా రైతులకు ప్రభుత్వ ధరతో పోల్చితే దాదాపు రూ.19 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు నష్టం జరగనుంది. ఇటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, అటు దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో కర్షకులు తల పట్టుకుంటున్నారు.

డిమాండ్ ఉంది.. దళారులతోనే ఇబ్బంది

మక్కలను బిస్కెట్ పరిశ్రమలో, కోళ్ల దాణా.. ఇలా పలు రకాలుగా ఉపయోగిస్తుండటంతో డిమాండ్ ఉంది. అయితే, ఇక్కడి కంటే తక్కువ రేటుకే ఇతర రాష్ట్రాల నుంచి వస్తుందంటూ దళారులు రేటు తగ్గిస్తున్నారు. వాస్తవంగా ఎకరా మొక్కజొన్న సాగుకు కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెడుతుంటారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోతే బతికేదెలా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు సిండికేట్‌గా మారి, ఒకే రేటుపై ఉంటున్నారని వాపోతున్నారు. ప్రభుత్వ సంస్థ రైతుల నుంచి మక్కలు కొనుగోలు చేసేందుకు రంగంలోకి దిగితే, వారు కనీసం ఆ రేటుకైనా కొనుగోలు చేసే పరిస్థితి ఉంటుందని అంటున్నారు.

ఇబ్రహీంపట్నంలో ఆందోళన



ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం: మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కొనుగోళ్లు చేపట్టాలని, రైతులకు రూ.లక్ష రుణమాఫీ వెంటనే చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. చేతికందని పంటను రైతుల వద్ద నుంచి దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమ కావడం లేదని, వెంటనే చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సీనియర్ అసిస్టెంట్ అనురాధకు వినతిపత్రం అందజేశారు. రైతు నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, కర్షకులు పాల్గొన్నారు.

కేంద్రాలు ప్రారంభించాలి



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మక్కలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. ఇప్పటివరకు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. రైతులు పంట అమ్ముకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా లాభం లేదు.

– కాటిపెల్లి రాజశేఖర్ రెడ్డి, రఘురాములకోట

రూ.300 తగ్గించారు



నాకు 35 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి వచ్చింది. దళారులు మొదట 15 క్వింటాళ్లకు క్వింటాల్‌కు రూ.2,200 చొప్పున రూ.33 వేలు చెల్లించారు. నాలుగు రోజుల తర్వాత మరో 20 క్వింటాళ్లు అమ్మితే క్వింటాల్‌కు రూ.1,900 చెల్లించారు. రూ.300 తగ్గించడంతో రూ.6 వేలు నష్టపోయాను. – నల్ల తిరుపతిరెడ్డి, రైతు, వేంపేట

శవమై తేలిన ధర్మతేజ



ధర్మతేజ (ఫైల్)

రామగుండం: ఎన్టీపీసీకి చెందిన పలువురు యువకులు ఈనెల 8వ తేదీన బర్త్ డే పార్టీ చేసుకునేందుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు వచ్చారు. కేక్ కట్ చేసి విందు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఐదుగురు మిత్రులు గోదావరినదిలో స్నానానికి దిగారు. ఈక్రమంలో కనకమేడల ధర్మతేజ(32) నీటిలో గల్లంతైన విషయం తెలిసిందే. 48 గంటల పాటు గోదావరినదిలో జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం లభించింది. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ తెలిపారు.

గుట్ట పైనుంచి పడి కార్మికుడి దుర్మరణం

- మృతుడు ఒడిశా వాసి

తిమ్మాపూర్(మానకొండూర్): మల్లాపూర్ ఎస్ఎల్‌వీ క్వారీలో ఒడిశాకు చెందిన కార్మికుడు గోపీనాథ్ హన్సల్(20) మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని చింతల్వాడ గ్రామానికి చెందిన గోపీనాథ్ హన్సల్ ఉపాధి కోసం మల్లాపూర్‌లోని క్వారీకి వచ్చాడు. మంగళవారం పనుల్లో ఉండగా దాహం వేయడంతో నీళ్లు తాగేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు కాలు జారి, గుట్టపై నుంచి రాళ్లపై పడ్డాడు. ఈ ఘటనలో అతని తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు క్వారీకి చెందిన వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువు శంభొనత్ శర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు

కరీంనగర్ క్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి కోర్టు మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 12మందిని కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. కరీంనగర్‌కు చెందిన రాజ్‌కుమార్‌కు మూడు రోజుల జైలు, రూ.2 వేల జరిమానా విధించారు. మిగితా 11 మందికి రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆయనతోనే ఆమె..



రోదిస్తున్న మృతురాలి తల్లి మధునమ్మ



రోదిస్తున్న అశోక్ తల్లిదండ్రులు

- కలిసి నడిచారు.. కలిసే 'పోయారు'
- భర్తతో కలిసి భార్య ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు
- మంథనిలో విషాదం నింపిన కౌలురైతు దంపతుల ఆత్మహత్య

మంథని: పుట్టినిల్లు.. మెట్టినిల్లు రెండూ నిరుపేద కుటుంబాలే.. కూలీపని చేసుకుంటేనే పూట గడిచేది.. వరద మిగిల్చిన దుఃఖం ఆ రెండు కుటుంబాలను చిదిమేసింది.. భర్తకు అన్నింటా చేదోడు వాదోడుగా, ఎంతో అన్యోన్యంగా ఉండే భార్య.. భర్త వెంటే తనువు చాలించింది.. అదే సమయంలో ఆమె తన ఇద్దరు చిన్నారుల భవితవ్యం గురించి ఒక్కసారైనా ఆలోచన చేయలేదు.. విషాదం మిగిల్చిన ఈ ఘటన కన్నీరు తెప్పించింది. మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధి నెల్లిపల్లిలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి తనవు చాలించిన కటుకు అశోక్(35)అంటే ఆయన భార్య సంగీత(28)కు అమితమైన ప్రేమ అని స్థానికులు అనుకుంటున్నారు. భర్తను ఎవరైనా చిన్నమాట అంటే వారించేదని, తన కూతురు, కుమారున్ని సైతం ఎంతోఅల్లారుముద్దుగా పెంచుకుందని, అలాంటి దంపతులిద్దరూ తన ఇద్దరు చిన్నారులను వదిలి కానరాని లోకాలకు వెళ్లడంపై స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రెండుసార్లు పంట మునక

గ్రామానికి చెందిన కటుకు రాయమల్లు– రమాదేవికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. రాయమల్లుకు ఉన్న కొద్ది పాటి భూమిని తానే సాగు చేసుకుంటున్నారు. ఓ కుమారుడు ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా అశోక్ ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి సాగు చేసుకుంటున్నాడు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో అశోక్ సాగు చేసిన వరి, పత్తి పంటలు రెండుసార్లు నీటమునిగి నష్టపోయాడు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన రూ.2లక్షల వరకు అప్పు ఎలా తీర్చేదనే మనస్తాపంతో తన భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు, స్థానికులు భావిస్తున్నారు.

పిల్లల ముఖాలకు పసుపు ఎందుకు రాసినట్లు?

దంపతులిద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి రామస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా వారి పిల్లలు సాయి, సన ముఖాలకు పసుపు ఉందని, అలా ఎవరు, ఎందుకు రాసి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ పనిమాని.. వ్యవసాయం వైపు..

అశోక్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడని, రెండుమార్లు ప్రమాదం నుంచి బయటపడడంతో ఆ పనిమానేసి వ్యవసాయం వైపు దృష్టి సారించినట్లు స్థానికులు తెలిపారు. కాగా అశోక్‌కు వ్యవసాయం కూడా అచ్చిరాలేదని, గతంలో కూడా మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు అనుకుంటున్నారు.

యువకుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె బైపాస్ రోడ్‌లో సోమవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో మ్యాక ప్రణయ్(26) మృతిచెందాడు. మోతె గ్రామానికి చెందిన మధు బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి, ఢీకొట్టడం వల్లే చనిపోయాడని మృతుడి తల్లి పుష్పలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

పెగడపల్లిలో వాహనాల తనిఖీ

పెగడపల్లి: మండల కేంద్రంలో స్థానిక పోలీసులు మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పత్రాలు సరిగా లేని వాటికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా రూ.50 వేలకు మించి తీసుకెళ్లరాదని, ఒకవేళ అంతకుమించి డబ్బులు తీసుకెళ్లాల్సి వస్తే సంబంధిత ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. లేకపోతే ఎన్నికల నిబంధనల మేరకు స్వాధీనం చేసుకొని, కోర్టులో జమ చేస్తామని పేర్కొన్నారు. అలాగే, గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కిందపడి గుర్తు తెలియన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. మండల పరిధిలో బిజిగిరిషరీఫ్, పొత్కపెల్లి రైల్వేస్టేషన్ల మధ్య 45ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ముఖం గుర్తు పట్టడానికి వీలులేకుండా ఉందని, ఎలాంటి గుర్తింపు కార్డులు లభించలేదని తిరుపతి తెలిపారు. ఒంటిపై నలుపు కలర్ ప్యాంట్ ఉందని అన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వఆస్పత్రిలో భద్రపరిచారు. వివరాల తెలిసినవారు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి.తిరుపతి, సెల్‌నంబర్ 9949304574, 8712658604కు సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల వేళ ఆర్టిస్టులకు ఉపాధి



వాల్ రైటింగ్ రాస్తున్న శ్యాం

రాయికల్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో జగిత్యాల నియోజకవర్గంలోని ఆర్టిస్టులకు ఉపాధి దొరికింది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా గ్రామాల్లో వాల్ రైటింగ్ రాయిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

'విశ్వకర్మ యోజన' సద్వినియోగం చేసుకోండి



వినతిపత్రాలు ఇస్తున్న విశ్వబ్రాహ్మణులు

కథలాపూర్: చేతివృత్తులను కాపాడేందుకు ప్రధాని మోదీ విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ యోజన పథకం ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట, సిరికొండ గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటా తిరిగి, పథకం గురించి ప్రజలకు వివరించారు. విశ్వబ్రాహ్మణుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పథకానికి 18 రకాల చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.3 లక్షల వరకు సాయం అందుతుందని పేర్కొన్నారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎద్మల వినోద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటి సత్యనారాయణ, నాయకులు బద్రి సత్యం, పల్లె గంగాధర్, గాంధారి శ్రీనివాస్, తుమ్మనపెల్లి మహేశ్, కాసోజి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మూ–కశ్మీర్‌లో 'సహకార' అధ్యక్షులు



ఆపిల్ తోటలను పరిశీలిస్తున్న సంఘాల అధ్యక్షులు

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లా సహకార సంఘాల అధ్యక్షులు మూడు రోజులుగా జమ్మూ–కశ్మీర్ పర్యటిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సహకార సంఘాల పనితీరుతోపాటు అక్కడి రైతులు సాగు చేసిన ఆపిల్, కుంకుమ పూలు, ఖాజు, బాదం తోటలను పరిశీలించారు. అక్కడి రైతులు సహకార సంఘాలుగా ఏర్పడి, పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్న తీరుపై అధ్యయనం చేశారు. డీసీఎంఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పర్యటనలో సహకార సంఘాల ఫోరం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాజసుమన్‌రావు, ఉపాధ్యక్షుడు నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శి పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోండి

- పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీనారాయణ భట్



శిక్షణ పొందుతున్న రైతులతో ప్రొఫెసర్లు

జగిత్యాల అగ్రికల్చర్: వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీపై రైతులు అవగాహన పెంచుకోవాలని పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీ నారాయణ భట్ అన్నారు. కళాశాలలో ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ ద్వారా రసాయన మందుల పిచికారీ, పాలిహౌస్‌లో ఉద్యాన పంటల సాగుపై రైతులకు మంగళవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న శాస్త్ర, సాంకేతికను ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కొత్త టెక్నాలజీని ఉపయోగించుకోకపోతే వెనకబడి పోవడమే కాకుండా ఖర్చు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఆర్.సుష్మాదేవి, ప్రజ్ఞ, పి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలి

- పార్టీ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి దిశానిర్దేశం
- మంత్రి కొప్పుల ఈశ్వర్‌ది అవినీతి పాలన
- రాత్రనక, పగలనక కష్టపడాలని పార్టీ శ్రేణులకు వినతి



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపించిన నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు రాత్రనక, పగలనక కష్టపడి పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. గొల్లపల్లి మండలకేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో ధర్మపురి నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని సూచించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ పదేళ్లుగా అవినీతికి పాల్పడుతూ.. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన సుమారు 100 మంది కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే బుధవారం బుగ్గారం మండలంలో గడపగడపకూ కాంగ్రెస్, గురువారం గొల్లపల్లి మండలంలోని చందోలి, దట్నూరులో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంతోపాటు రోడ్‌షో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, పెగడపల్లి మండల అధ్యక్షుడు రాములు, బుగ్గారం మండల ఉపాధ్యక్షుడు నర్సాగౌడ్, సర్పంచులు చిర్ర గంగాధర్, సత్యనారాయణ, ఉపసర్పంచులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడితేనే విజయం

వెల్గటూర్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి మండలం రాజారాంపల్లిలోని ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి మండల అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహాలు, కాంగ్రెస్ గెలుపునకు తీసుకోవాల్సిన చర్యలను కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో వెల్గటూర్, ధర్మారం కాంగ్రెస్ అధ్యక్షులు శైలేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

కథలాపూర్: భూషణరావుపేటలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఐలేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో బెల్ట్ షాపుపై మంగళవారం దాడి చేయగా మద్యం లభ్యమైందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు జోరుగా నిర్వహిస్తున్నారని, కొన్ని గ్రామాల్లోనే పోలీసులు దాడులు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గొధూర్ గ్రామంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని గొధూర్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. రూ.50 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉమాసాగర్ మంగళవారం తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెల్గటూర్ మండలంలో..

వెల్గటూర్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో వెల్గటూర్ మండలంలో బెల్ట్ షాపులపై సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు పోలీసులు దాడులు నిర్వహించారు. రాజారాంపల్లిలో 2, కప్పారావుపేటలో 2, అంబారిపేటలో 3, వెల్గటూర్‌లో 1, శాఖాపూర్‌లో 1 చొప్పున మొత్తం 9 బెల్ట్ షాపుల్లో రూ.1.04 లక్షల విలువైన 220 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.